నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | సెప్టెంబర్ 06, 2024 | www.navatelangana.com

ధృవపత్రాలతో రైతులు సిద్ధంగా ఉండాలి

నవతెలంగాణ-జన్నారం



జన్నారం క్లస్టర్ పరిధిలో ఉన్న గ్రామాల్లో రైతు రుణమాఫీకి సంబంధించి రేషన్ కార్డు లేని రైతులు ధృవపత్రాలతో సిద్ధంగా ఉండాలని ఏఈఓ త్రిసంధ్య కోరారు. శుక్రవారం ధర్మారం, రేండ్లగూడ, బాదంపల్లి, జన్నారం, పోన్కాల్ గ్రామాల్లో సమావేశం నిర్వహించి రైతుల నుండి ధృవపత్రాలు తీసుకుంటామన్నారు. రుణమాఫీ స్వీయ ధృవీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, క్రాప్ లోన్ అకౌంట్ జిరాక్సులతో రైతులు సిద్ధంగా ఉండాలన్నారు.

8 నుంచి సీపీఐ(ఎం) శాఖ మహా సభలు

నవతెలంగాణ-మంచిర్యాల



ఈనెల 8 నుండి జిల్లాలోని 18 మండలాల్లో సీపీఐ(ఎం) శాఖ మహా సభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ డెంగ్యూ, చికెన్ గున్యా, టైఫాయిడ్ విష జ్వరాలతో జిల్లా ప్రజలు అల్లాడుతున్నారని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మరిన్ని పారిశుధ్య సమస్యలు ఏర్పడడంతో వ్యాధుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా దోమల మందు ప్యాకింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈనెల 8 నుండి 30 వరకు జరిగే సీపీఐ(ఎం) శాఖ మహా సభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాష్, పట్టణ నాయకులు అరిగేల మహేష్, మీడివెల్లి రాజు, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

బీమా లేదు..ధీమా ఏదీ..?

▶ వరదల ప్రభావంతో పత్తి, సోయా పంటలకు నష్టం ▶ మట్టి, ఇసుక మేటలతో ఎదుగుదలకు విఘాతం ▶ ఫసల్‌బీమాలో ప్రీమియం చెల్లించని ప్రభుత్వం
▶ తాజాగా పంటల నష్టంతో పరిహారానికి దూరం ▶ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఆదుకోవాలంటున్న అన్నదాతలు

ఆరుగాలం శ్రమించి వేసిన పంటలు చేతికొచ్చే వరకు రైతులకు ఆందోళన తప్పదు. వేసిన పంటలను సంరక్షించుకోవడం వారికి సవాల్‌గా మారుతోంది. ప్రస్తుతం వరదల కారణంగా పంటలు నష్టపోవడంతో తీవ్ర నిర్వేదంలో ఉన్నారు. ఈ క్రమంలో పంటలకు బీమా సౌకర్యం లేకపోవడంతో పరిహారంపై సందిగ్ధం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సంబంధించి ప్రీమియం చెల్లించకపోవడంతో పంటలకు పరిహారం రావడం కష్టతరంగా మారింది. ఎన్నికల సమయంలో ప్రభుత్వమే పంటలకు ప్రీమియం చెల్లిస్తుందని హామీనిచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విషయాన్ని విస్మరించడంతో అన్నదాతలు నష్టపోవాల్సి వచ్చింది. తాజాగా అధిక వర్షాల కారణంగా వేల ఎకరాల్లో పంటలు నీటిపాలు కావడంతో ఈ నష్టాన్ని ఎవరు భరిస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వమే నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని సర్వత్రా డిమాండ్లు వినిపిస్తున్నాయి. పంటల సర్వే చేపట్టిన వ్యవసాయశాఖ అధికారులు ఎన్ని ఎకరాల్లో నష్టం జరిగిందో వివరాలు తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు.



కరంజి గ్రామంలో నీట మునిగిన పంటలు (ఫైల్)

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయి. మూడు కాలాలు ఒకదానికొకటి పోటీ పడుతుంటాయి. ముఖ్యంగా ఇక్కడ అతివృష్టి..లేదంటే అనావృష్టి నెలకొనడం సాధారణంగా జరుగుతుంది. 80శాతం మంది రైతులు వర్షాధారం మీదనే ఆధారపడి పంటలు పండిస్తుంటారు. అధిక వర్షం కురిసినా..అవసరం మేరకు కురవకపోయినా పంటలకు నష్టం జరుగుతుంది. ఈ క్రమంలో కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్‌బీమా పథకం చేరడం రైతులకు కీలకంగా మారింది. ఈ పథకంలో భాగంగా రైతులకు పంట రుణాలు మంజూరుచేసే సమయంలో బ్యాంకులు వారి నుంచి పంటలకు ప్రీమియం కట్ చేసుకుంటుంది. ఇందులో రైతు వాటాతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం వేర్వేరుగా బీమా కంపెనీలకు వాటా చెల్లిస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2018- 19 వరకు ఈ పథకాన్ని అమలు చేయగా.. అనంతరం అప్పటి ప్రభుత్వం బీమా కంపెనీలకు వాటా చెల్లించకపోవడంతో ఈ పథకం అర్ధాంతరంగా నిలిచిపోయింది. రైతుల నుంచి కూడా ప్రీమియం తీసుకోవడం లేదు. దీంతో ప్రకృతి వైపరిత్యాలు సంభవించి పంటలకు నష్టం వాటిల్లిన సందర్భంలో బీమా కంపెనీల నుంచి పరిహారం రావడం లేదు. మరోపక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడం కూడా సమస్యగా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఈ ఏడాది ప్రభుత్వం మీదనే భరోసా..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది 5.70లక్షల మంది రైతులు 17లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. 10.44లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగవుతుండగా.. 2.10లక్షల ఎకరాల్లో సోయా, మరో 1.10లక్షల ఎకరాల్లో కందులు, 3.35లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా.. మిగితా వాటిలో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలోనే ఆయా పంటలకు సంబంధించి రైతుల నుంచి ప్రీమియం తీసుకునే వెసులుబాటు ఉండేది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఫసల్‌బీమా కింద రైతుల వాటాను సైతం ప్రభుత్వమే చెల్లిస్తుందని ఎన్నికల సమయంలో హామీనిచ్చింది. ఈ ఏడాది జులై 15వరకు ప్రీమియం చెల్లించేందుకు గడువు ఉండగా.. ప్రభుత్వం ఆలోగా బీమా కంపెనీలకు ప్రీమియం చెల్లించలేదని తెలిసింది. దీంతో ఇన్సురెన్సు కంపెనీల నుంచి పంటలకు పరిహారం రాకుండాపోయింది. తాజాగా అతివృష్టి కారణంగా నదులు, వాగులు ఉప్పొంగి సమీప పంట పొలాలను ముంచెత్తాయి. ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 2వేల ఎకరాల్లో పత్తి, సోయా తదితర పంటలకు నష్టం వాటిల్లగా.. మిగితా జిల్లాల్లోనూ ఇదే తరహా పరిస్థితి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పంటలు నష్టపోవడం..బీమా సౌకర్యం లేని పరిస్థితిలో ప్రభుత్వమే రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలనే డిమాండ్లు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ రాలేదు

-శ్రీధర్‌స్వామి, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ప్రభుత్వ ఆదేశాల మేరకు నష్టపోయిన పంటల వివరాలపై సర్వే చేపడుతున్నాం. ఫసల్ బీమాకు సంబంధించి మాకు ఎలాంటి సమాచారం లేదు. దీనికి సంబంధించిన గైడ్స్‌లైన్స్ రాలేదు. పంట నష్టం వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తాం.

ప్రభుత్వమే పరిహారం చెల్లించాలి


గావండే చంద్రకాంత్, రైతు, మాంగ్రూడ్



గ్రామంలో ఎనిమిది ఎకరాల్లో పత్తి పంట వేశాను. ఇటీవల వచ్చిన వరదల కారణంగా పంటంతా వరదపాలైంది. ఎకరానికి రూ.35వేల వరకు పెట్టుబడి రూపంలో ఖర్చు చేశాను. ఫసల్ బీమా సౌకర్యం ఉంటే పరిహారం వచ్చేది. కానీ ప్రస్తుతం ఈ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వమే పరిహారం అందించి ఆదుకోవాలి.

పరిహారం చెల్లించి ఆదుకోవాలి

-బండి దత్తాత్రి, అఖిలపక్ష రైతుల సంఘం నాయకుడు



అధిక వర్షాల కారణంగా వరదలు సంభవించి జిల్లాలో 2వేల ఎకరాల వరకు పంటలకు నష్టం వాటిల్లింది. పంటలకు బీమా కోసం ప్రీమియం తామే చెల్లిస్తామని ఎన్నికల సమయంలోనూ ప్రభుత్వం చెప్పింది. కానీ చెల్లించలేకపోయింది. తాజాగా రైతుల పంటలకు నష్టం వాటిల్లడంతో బీమా రాలేని పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో ప్రభుత్వమే రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

మత్తడి చెరువులో వింత చేప లభ్యం



నవతెలంగాణ-తలమడుగు

వడ్డాడి గ్రామ మత్తడి చెరువులో ఓ వింత చేప వలలో చిక్కుకున్నట్లు ఉండం గ్రామానికి చెందిన సురేష్ తెలిపారు. గురువారం ఉదయం ఎప్పటిలాగే వలలు తీసుకొని మత్తడి వాగులో చేపల కోసం వలలు వేయగా మిగతా చేపలతో పాటు ఈ వింత చేప కూడా వలలో చిక్కినట్లు ఆయన తెలిపారు. ఈ చేపను ఇంతవరకు ఎవరు తిన్నట్లు కూడా ఆనవాళ్లు లేవని తెలిపాడు. ఈ చేప వివిధ రకాల చేపలను తింటుందని తెలిపారు. ఈ విషయం ఫిషర్స్ డిపార్ట్మెంట్ వారికి తెలుపగా అలాంటి చేపను పడవేయాలని సూచించినట్లు సురేష్ తెలిపారు.

అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలో నీటిపారుదల శాఖ ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు ఆపాలని, ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని నీటిపారుదల శాఖ ప్రభుత్వ భూములను కొందరు అక్రమించుకుని కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ సంబంధించిన అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇట్టి నిర్మాణం గురించి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని పేర్కొన్నారు. నీటిపారుదల ప్రభుత్వ భూమిని ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడే విధంగా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగం పై ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు దుర్గం లింగన్న, ఆకుల సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేయాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పంచాయతీల్లో తాగు నీటి బావులతో పాటు వివిధ ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని డిప్యూటీ సీఈఓ కలిందని అన్నారు. గురువారం ఆమె మండలంలోని శంకర్‌గూడ, ముత్నూర్ తదితర పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీటి బావులు, సానిటేషన్‌ను పరిశీలించారు. డ్రైనేజీలను ప్రతి రోజూ సానిటేషన్‌ను నిర్వహించాలని సూచించారు. అలాగే చెత్త చెదారాన్ని ట్రాక్టర్‌లో తరలించాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ భాస్కర్,సెక్రటరీ ప్రమీల ఉన్నారు.

అధైర్యపడొద్దు.. ప్రభుత్వం ఆదుకుంటుంది



నవతెలంగాణ-తాంసి

భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇంఛార్జి ఆడె గజేందర్ అన్నారు. గురువారం భీంపూర్ మండలం అర్లి(టి)లో పంట పొలాలను డీసీసీబీ చైర్మెన్ అడ్డిభోజారెడ్డి, ఆత్రం సుగుణ తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం భారీ వర్షాలతో పెనుగంగ పొంగిపొర్లడంతో బ్యాక్ వాటర్ కారణంగా పంటలు నష్టపోవడం జరుగుతుందని తెలిపారు. గత పదేండ్లుగా రైతులకు ఎలాంటి పరిహారం అందలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని భరోసానిచ్చారు. సర్వే పూర్తయిన తర్వాత నివేదికను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అశోక్, అన్ను పటేల్, రమేష్, మురళి యాదవ్, కృష్ణ, మల్లేష్, సుదర్శన్, శ్రీనివాస్, మగ్బాల్, విఠల్, మండల నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ- నార్నూర్

పదో తరగతిలో వంద శాతం ఫలితాలు వచ్చిన సందర్భంగా గాదిగూడ మండలంలోని ఝరి ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు అవార్డులు అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం ఉట్నూర్ లో ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్,ఐటిడిఎ పిఓ ఖుష్బు గుప్తా చేతుల మీదుగా వీటిని స్వీకరించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న వారిలో ప్రధానోపాధ్యాయుడు కొట్నాక్ రాజేశ్వర్,హెచ్‌డబ్ల్యూఓ ఆత్రం రామకృష్ణ ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

పోషణ లోపాన్ని అధిగమించాలి



- కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో పోషణ్ అభియాన్ కార్యక్రమం ద్వారా పోషణ లోపాన్ని అధిగమించే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జి జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వరూపారాణి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి హరీష్ రాజ్, జడ్పీ సీఈఓ గణపతి, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్‌తో కలిసి ఈ నెల 30 వరకు నిర్వహించే పోషణ్ మాహ్-2024 కార్యక్రమ సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోషణ్ మాహ్ కార్యకలాపాల నిర్వహణపై రూపొందించిన కార్యచరణ ప్రకారం కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, పిల్లల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, శామ్‌మామ్ లోపాలు గల పిల్లలను గుర్తించి వారు సాధారణ స్థితికి వచ్చే లాగా సకాలంలో పౌష్టికాహారం, అవసరమైన మందులను అందిస్తూ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శన కార్యక్రమాలు చేపట్టాలని, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పోషణ్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడీపీఓలు విజయలక్ష్మి, రేష్మ, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త రజిత, ఉమెన్ హబ్ టీం, సూపర్‌వైజర్లు, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలి



నవతెలంగాణ-లోకేశ్వరం

పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ ఆర్కా మోతిరాం అన్నారు.మండలంలోని భామ్ని అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి సెంటర్‌లో స్టాక్ వివరాలను, రిజిస్టర్లను పరిశీలించారు. కేంద్రానికి వచ్చే చిన్నారులు, బాలింతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పిల్లల హాజరు శాతం పెంచాలని, వారికి నాణ్యమైన భోజనం అందించాలని అంగన్వాడీ ఉపాధ్యాయురాలు ఫర్హానాకు సూచించారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ లలిత ఉన్నారు.

కుల వృత్తులను కాపాడుకోవాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

కనుమరుగవుతున్న కుల వృత్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ నల్ల ధర్మన్న అన్నారు. గురువారం ఇచ్చోడ మండల కేంద్రంలోని టీచర్స్ డే సందర్భంగా వినత్న ఆలోచనతో విద్యార్థులకు పల్లెలే పట్టణానికి పట్టు కొమ్మలు అనే అంశంపై మట్టి కుండలు తయారు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా చూసి నోట్ చేపించారు. కొలిమిలో గొడ్డలి, కొడవలి తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. వనపాములతో వర్మికంపోస్టు తయారు చేసిన ఎరువులను విద్యార్థులు నోట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ధర్మన్న మాట్లాడుతూ ఏ విషయం పైన చదివిన వినే కంటే కళ్ళతో చూసిందే విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోరు అన్నారు.కుల వృత్తుల వారు తయారు చేసే వస్తువులలో ప్రమాదకమైన ప్లాస్టిక్ ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, వెంకటేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రజలందరూ సంయమనం పాటించాలి





- రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్
- సమస్యాత్మక గ్రామాలను సందర్శించిన సీపీ
- పుకార్లు, వదంతులు నమ్మొద్దని సూచన

నవతెలంగాణ-జన్నారం

జైనూర్ ఘటన నేపథ్యంలో ప్రజలు సంయమనం పాటించాలని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ కోరారు. గురువారం జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలను గురువారం ఆయన సందర్శించారు. జైనూర్‌లో జరిగిన అల్లర్ల నేపథ్యంలో కమీషనరేట్ పరిధిలో జన్నారం మండలంలోని ఆదివాసీ గూడాలుండటంతో ఎలాంటి అవంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు భాగంగా కవ్వాల్, లోతొర్రె, దేవుని గూడా, కిష్టాపూర్ గ్రామాలను సందర్శించి ప్రజలు, యువత, గ్రామ పెద్దలు, ఆదివాసీ సంఘాల నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ప్రజలందరూ సంయమనం పాటించాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ధర్నాలు, రాస్తారోకోలు చేసి చట్టాన్ని చేతిలోకి తీసుకొని గొడవలు, అల్లర్లకు పాల్పడడం చేస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామన్నారు. వదంతులు నమ్మొద్దని, ప్రస్తుతం ప్రశాంత వాతావరణంలో జైనూర్ ఉందని తెలిపారు. సోషల్ మీడియాలో వదంతులను వ్యాప్తి చేసే వారితో పాటు గ్రూప్ అడ్మిన్‌లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు ప్రజలందరూ పోలీసకు సహకరిస్తున్నారని భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీ వెంట ఆర్ఐలు సంపత్, వామన మూర్తి, ఎస్సై రాజవర్ధన్ ఉన్నారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరగా న్యాయం

ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా బాధితులకు త్వరగా న్యాయం చేసే విధంగా కృషి చేస్తామని రామగుండం సీపీ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లో తుడుం దెబ్బ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం సీపీని నేతలు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడికి గురైన ఆదివాసీ మహిళకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. మహిళపై దాడి చేసిన మగ్దూను అరెస్ట్ చేసి జైలుకు పంపడం జరిగిందని చెప్పారు. నిందితునికి కఠిన శిక్ష పడేలాగా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, బెల్లంపల్లి ఏఆర్ డీఎస్పీ సురేందర్, సంపత్ కుమార్, వామన్ కుమార్, ఎస్సై గుండేటి రాజవర్ధన్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు రాయిసిడాం కాలి, ఉపాధ్యక్షుడు ఉర్వేత దర్ము, కోశాధికారి తొడసం గంగు పటేల్, జిల్లా, మండల నాయకులు మేస్రం రాజ్ కుమార్, పెంద్రం రాజేష్, పి.సుధాకర్, వసంత్, ఆనంద్, పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి అనుమతి తప్పనిసరి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కొత్తగా భవన నిర్మాణం చేపట్టేవారు కార్మిక శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి పొందాలని సహాయ కార్మిక అధికారులు రాజలింగు, వినోద్ అన్నారు. కార్మికశాఖ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా గురువారం పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణదారులకు అవగాహన కల్పించారు.. బల్దియాలో అనుమతి తీసుకునేటప్పుడు లేబర్ సెస్ చెల్లిస్తున్నారని, కానీ కార్మిక శాఖకు దరఖాస్తు చేసుకోవడం లేదన్నారు. అలాగే గుర్తింపు కార్డులున్న కార్మికులనే పనిలో పెట్టుకోవాలని అన్నారు.

పిల్లలకు పౌష్టికాహారాన్ని పెట్టాలి

నవతెలంగాణ-తాంసి



చిన్నపిల్లలకు గర్భిణులకు అందించే పౌష్టికాహారాన్ని మెనూ ప్రకారం అందించాలని తహసీల్దార్ లక్ష్మి అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ లక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం పాలు, గుడ్లను స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారాన్ని పిల్లలకు, గర్భిణీలకు బాలింతలకు అందజేయాలన్నారు. ఆమె వెంట ఆర్ఐ రవీందర్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి ఉన్నారు.

8న జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్11 బాలబాలికల జిల్లాస్థాయి చదరంగం ఎంపిక పోటీలను ఈనెల 8న నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజింగ్ సెక్రటరీ నన్నపు స్వామి, కన్వీనర్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 1జనవరి 2013 తర్వాత జన్మించిన బాలబాలికలు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని, ఉమ్మడి జిల్లాలోని ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్‌కు చెందిన బాల బాలికలు పోటీలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తిగల బాలబాలికలు ఈనెల 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే బాలబాలికలు వయసు ధ్రువీకరణ పత్రంతో పాటుగా తమ సొంత చెస్ బోర్డు వెంట తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9848736476 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

పోలీసు పికెటింగ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లింగోజీ తండ గ్రామపంచాయతీ పరిధిలో పోలీస్ పికెటింగ్ బందోబస్తును ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం. నిన్న జరిగినటువంటి జైనూర్ సంఘటన గురించి పోలీస్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. చుట్టుపక్క ప్రదేశాల నుంచి వస్తున్న వారిని పోలీస్ అధికారులు వారి ఆధీనంలో తీసుకుంటున్నారు. జైనూర్‌లో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. కనుక ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఏ నాయకులైన సరే జైనూర్‌కి వెళ్లడానికి అనుమతి లేదని ప్రస్తుతం పోలీసులు శాంతిభద్రతలను ఏర్పర్చుకుంటున్నారు. వీరితో పాటు మాజీ సర్పంచ్ హరినాయక్, గ్రామ ప్రజలు, పోలీసులు ఉన్నారు.

బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్సీసీ ఎంపిక ప్రక్రియ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో 32వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో గురువారం డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్సీసీ స్టాఫ్ మోహిత్‌సింగ్, నవీన్ పాల్గొని విద్యార్థులకు రన్నింగ్, సంబంధిత ఫిజికల్ ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా.అతిక్ మాట్లాడుతూ ఇది చాలా మంచి సదావకాశమని దీని ద్వారా దేశానికి ఎంతో సేవ చేయొచ్చని, ఐక్యత, సత్ప్రవర్తన దేశభక్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్సీసీ కేర్ టేకర్ చంద్రకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

6న జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 6న ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్జీఎఫ్ అండర్-14 బాలికల జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సీహెచ్ కాంతారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1జనవరి 2011 తర్వాత జన్మించి, 48 కేజీలలోపు బరువు ఉన్న బాలికలు 14 సంవత్సరాల విభాగంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అర్హులైన క్రీడాకారులు సంబంధిత వయసు ధ్రువీకరణ పత్రం, బోనాఫైడ్ తో ఉదయం 10 గంటలకు పోటీల కన్వీనర్, ఆర్గనైజర్ హెచ్‌ఎం శ్రీనివాస్‌కు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థినుల చొప్పున హాజరయ్యేలా చూడాలన్నారు. పూర్తి వివరాలకు 9493534163 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జవహర్ నవోదయలో అడ్మిషన్లు

2025-26 విద్యాసంవత్సరానికి జవహర్ నవోదయలో ఆరో తరగతి అడ్మిషన్ల కొరకు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెలక్షన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈనెల 16లోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.గావ్.ఇన్ వెబ్‌సైట్‌లో ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 2025 జనవరి 18న పరీక్ష నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. జిల్లాలోని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్పాట్ ద్వారా ప్రవేశాలకు దరఖాస్తులు

తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో, మొదటి సంవత్సరంలో స్పాట్ ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, ప్రిన్సిపల్ డా. జె.అరుణకుమారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి గాను ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన వారు (బీఎస్సీ, ఎంపీసీ, ఎంఎస్సీఎస్, ఎం జెడ్సీ, బీజెడ్సీ, బికాం, బీఏ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థినులు ఈ నెల 6వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థినులు పదో తరగతి, ఇంటర్మీడియట్ మెమోలు, టీసీ, కులం, ఆదాయ ధ్రువపత్రాలు, ఫోటోలు, ప్రి దోస్త్ రిజిస్ట్రేషన్ ఐడి జిరాక్స్ సెట్‌తో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 8790009838 నెంబరును సంప్రదించాలని కోరారు.

జిల్లాలో పడకేసిన వైద్యం

- బండారు రవికుమార్
- ఖాళీ వైద్య పోస్టులను భర్తీ చేయాలి
- రైతులకు నష్టపరిహారం అందించాలి
- సీసీఐని తెరిపించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో వైద్యం పడకేసిందని, వైద్యులు లేక వైద్యమందక రోగులు అవస్థలు పడుతున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పేరుకే పెద్దాసుపత్రులుగా రిమ్స్, సూపర్ స్పెషాలిటీలు ఉన్నాయన్నారు. జ్వరాలతో ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయన్నారు. జ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 53 డాక్టర్ పోస్టులు ఉండాల్సి ఉండగా 34 మాత్రమే ఉన్నాయన్నారు. 19 ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, డిమాండ్ చేశారు. ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 83 ఉన్నాయని కానీ 49 మంది మాత్రమే ఉన్నారని మిగితావి ఖాళీగా ఉన్నాయన్నారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో 8 విభాగాలకు 36 పోస్టులు ఉండగా 9 మందే ఉన్నారని మిగిలిన పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రిమ్స్‌లో 120 నర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పేషేంట్లకు మందులు లేక బయట మెడికల్ షాపులో కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పేదలకు ఇది భారంగా మారిందని పేర్కొన్నారు. అలాగే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి సోయా పంటలకు జరిగిన నష్టానికి ఎకరానికి రూ.30వేలను ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే పట్టణంలో తలమానికంగా ఉన్న సీసీఐ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని, తద్వారా నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందని అన్నారు. ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, లంక రాఘవులు, పూసం సచిన్, అన్నమొల్ల కిరణ్, పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.మంజుల, ఆర్.సురేందర్, ఎం.గంగన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

- నిందితుడిని శిక్షించాలని డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జైనూర్‌కు బయలుదేరిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే ఇంటి వద్ద బందోబస్తు నిర్వహించి, హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జైనూర్‌లో ఆదివాసీ మహిళను అత్యాచారం చేసిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేరే రాష్ట్రాల్లో జరిగిన సంఘటనలను స్పందించే ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సొంత రాష్ట్రంలో జరిగిన ఘటనపై మాట్లాడకపోవడం సిగ్గుచేటని అన్నారు. జైనూరు ఘటనలో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి పోతున్న తనను హౌస్ అరెస్టు చేయడం తగదన్నారు. ఎంపీ ఎన్నికల సమయంలోనే ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశామని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితుడిని శిక్ష పడేలా చూడాలన్నారు. జైనూర్‌లో రోహింగ్యాలు, బంగ్లాదేశ్ నుంచి ఎక్కడ నుంచి వస్తున్నారో పోలీసుల దర్యాప్తు చేయాలన్నారు. ఎంపీ ఎన్నికల సమయంలో ప్రభుత్వానికి తాము అప్రమత్తం చేసినప్పటికీ నిర్లక్ష్యం వహించిందన్నారు. అసదుద్దీన్ ఓవైసీ మాటలు ఓ వర్గానికి లోబడి మాట్లాడుతున్నారని అన్నారు. రాజకీయ నాయకులు ఏం చేస్తున్నారు. తెలుసుకునే ఇంటలిజెన్స్ పోలీసు వ్యవస్థ ఆదివాసులపై ఇలాంటి ఘటనలు జరుగుతున్న ముందస్తు తెలుసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రఘుపతి, లాలామన్న, జోగు రవి, సోమ రవి, ఆకుల ప్రవీణ్, దినేష్ మటోలియా, శ్రీనివాస్, సూర్యకిరణ్, అశోక్‌రెడ్డి, శివ, రాజు, విశాల్, అనిల్ ఉన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలి

నవతెలంగాణ-భైంసా



గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజల సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం గణేష్ ఉత్సవాల సందర్భంగా భైంసా పట్టణంలో ఏఎస్పి అవినాష్ కుమార్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. ఈ సందర్భం కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాల పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భైంసాలో పట్టణంలో దాదాపు 200 గణేషుని మండపాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని, ప్రతి మండపం దగ్గర సీసీ కెమెరాలు, పోలీసు భద్రతను ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణంలో పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ నిరంతరం పారిశుద్ధ్యం నిర్వహించాలన్నారు. ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని ముఖ్య కూడళ్లు, ప్రధాన రహదారులలో అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. నిమజ్జనం జరిగే మార్గాన్ని పరిశీలించి, ఆ మార్గంలో శోభాయాత్రకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రహదారులను సిద్ధం చేయాలన్నారు. శోభయాత్ర మార్గంలో ఉన్న గుంతలను పూడ్చివేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా చేయాలని, వదులుగా ఉన్న వైర్లు సరిచేయాలని ఆదేశించారు. గడ్డెన్న వాగు ప్రాజెక్టు వద్ద నిమజ్జనం ప్రాంతాన్ని సందర్శించారు. ఆ ప్రాంతంలో క్రేయిన్లు, లైటింగ్, భారీకేడ్లు, పోలీసు భద్రత వంటి సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. నిమజ్జనం సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. చిన్నపిల్లలు నిమజ్జనం ప్రాంతం సమీపంలోనికి రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కోమల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, రెవెన్యూ మున్సిపల్, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం భైంసా ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. రోగులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని, సరిపడినన్ని బెడ్లు, మందులు, ఇతర వైద్య పరికరాలు నిరంతరం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్యులంతా తప్పనిసరిగా సమయపాలనను పాటించాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి, నిరంతరం పరిశుభ్రతను పాటించాలన్నారు. ఇన్ పేషెంట్, బయటి రోగుల విభాగం, మందుల గది, ఇంజక్షన్లు, టీకాల గదిని పరిశీలించి. ప్రసూతి, ఆరోగ్య శ్రీ విభాగాలకు సంబంధించిన అన్ని రకాల రిజిస్టర్‌లను కలెక్టర్ తనిఖీ చేశారు. చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడుతూ ఆసుపత్రుల్లో గల సౌకర్యాలు, అందిస్తున్న చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కోమల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, ఆసుపత్రి పర్యవేక్షకులు కాశీనాథ్, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సర్వీస్ చేయడానికే డీఎల్ఎస్ఏ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కోర్టులో కూర్చుని జడ్జిమెంట్లు ఇవ్వడమే కాకుండా ప్రజలకు సర్వీస్ ఇవ్వాలనే ఉద్దేశంతో న్యాయ సేవ అధికార సంస్థ పని చేస్తుందని డీఎల్ఎస్ఏ కార్యదర్శి బి.సౌజన్య అన్నారు. గురువారం పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల కళాశాల, పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు సైబర్ సెల్ సిబ్బంది సంతోష్, సాయిశివలు సైబర్ క్రైమ్ గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి బి. సౌజన్య మాట్లాడుతూ న్యాయమూర్తులంటే కోర్టులో ఉండకుండా ప్రజలకు సర్వీస్ ఇవ్వాలనే ఉద్దేశంతో డీఎల్ఎస్ఏ స్థాపించడం జరిగిందన్నారు. గత నెల 22న వసతి గృహాన్ని సందర్శించి లోటుపాట్లను గుర్తించి హైకోర్టు గురుకులాల అధికారులతో పాటు ప్రభుత్వానికి నివేదించడంతో సమోటోగా కేసు నమోదు చేశామన్నారు. దాని వల్ల కొన్ని సౌకర్యాలు వచ్చాయన్నారు. నిర్మాణంలో ఉన్న భవనం కూడా త్వరలో అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తామన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అందుకే కళాశాలలు, పాఠశాలల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. దాదాపు ఐదు వేల వరకు చట్టాలున్నాయని వాటి గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ దాసరి గంగారాం, ప్రిన్సిపాల్ లలిత కుమారి, వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జేఏసీ తరపున నష్టపోయిన వారికి సహాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారీ వర్షాలతో నష్టపోయిన వారి సహాయార్థం ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ తరపున ఒక్క రోజు వేతనం ఇవ్వడానికి అంగీకరించి సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చామని జేఏసీ కన్వీనర్ అశోక్ అన్నారు. కానీ దీన్ని డిప్యూటి కలెక్టర్ల సంఘం నాయకుడు లచ్చిరెడ్డి తామే ఇచ్చామని చెప్పడం సరికాదని అన్నారు. గురువారం పట్టణంలోని టీఎన్జీవోస్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.. వర్షాల కారణంగా ఆస్తి, పంట, ప్రాణ నష్టం జరిగిందన్నారు. తమ వంతుగా ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఒక్క రోజు వేతనం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనికి సంబంధించి సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం కూడా ఇచ్చామన్నారు. కానీ లచ్చిరెడ్డి మాత్రం అంత తామే ఇచ్చామని సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కరం కోసం 205 గుర్తింపు సంఘాలతో ఏర్పడిందన్నారు. పెండింగ్ డీఏ, ఏరియర్స్ బిల్లుల గురించి డిప్యూటి సీఎంకు విన్నవించడం జరిగిందన్నారు. ఉద్యోగులందరు తమ వైపు ఉన్నారని దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో టీఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, ప్రధానకార్యదర్శి కె.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని పట్టణానికి చెందిన సామాజికవేత్త ముడుపు మౌనిష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో సానిటేషన్ పనులు నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీలో వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు మురికి కాల్వలలో, ఖాళీ స్థలాలలో, నీళ్ల నిల్వ ఉన్నచోట్ల బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. వ్యాధుల ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఆయన వెంట కాలనీవాసులు, యువకులు ఉన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం అందజేసిన ఐటీడీఏ పీఓ

నవతెలంగాణ-ఉట్నూర్



ఇటీవల లైంగికదాడికి గురైన బాధితురాలికి ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా ఆర్థిక సాయాన్ని అందించారు. తక్షణ సాయం కింద రూ.లక్ష మంజూరు చేయించారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఇంకేమైనా ఉత్తమ చికిత్స అవసరమైతే తమ దృష్టికి తీసుకువస్తే నా వంతుగా ఇంకా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. గిరిజనులకు వర్తించే పథకాలన్ని స్వల్ప కాలంలో మంజూరు ఇప్పిస్తామని సూచించారు. ఏజెన్సీ గ్రామాల భూములు (ఎల్‌టీఆర్) కేసులను త్వరగా పరిష్కారం జరిగేలా చూస్తామన్నారు. ఐటీడీఏ ద్వారా ఉపాధి కొరకు మంజూరు అయిన కిరాణ దుకాణాలు, కుట్టు మిషన్ల వంటి గిరిజన పథకాలలో ఏమైనా మరమ్మతులు కావాల్సి వస్తే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే గిరిజన రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరు చేయించి మరమ్మతులు జరిపిస్తామని తెలిపారు.

నిందితుడిని జైలుకు పంపించాం

- జైనూర్ ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం
- ఇరు వర్గాల ప్రజలు సంయమనం పాటించాలి
- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్



జైనూర్ మండలంలో ఓ మహిళపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అదుపులో తీసుకొని జైలుకు పంపారని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఉట్నూరు మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జైనూర్ మండల కేంద్రంలో బుధవారం జరిగిన ఘటన బాధాకరమని అన్నారు.జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క డీజీపితో మాట్లాడి నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు.ఇరు వర్గాలు సంయమనం పాటించాలన్నారు.ఆదివాసీలను అడ్డంపెట్టుకొని కొందరు ప్రశాంతమైన వాతావరణాన్ని చెడగొట్టే కుట్ర పన్నుతున్నారని,ఈ ఘటనలో బీజేపీ,బీఆర్ఎస్ నాయకులు హస్తం ఉందన్నారు.అమాయక ఆదివాసి యువతను మభ్యపెట్టి వారి జీవితాన్ని సర్వ నాశనం చేయడానికి కొన్ని సంఘ విద్రోహ శక్తులు కుట్ర పన్నుతున్నాయని, ఆదివాసి యువత ఎవరో చెప్పిన మాటలు విని ఆగం కావొద్దని విజ్ఞప్తి చేశారు.సార్మెడీలు,పటేల్లు, ఆదివాసీ యువతకు మంచి మార్గం వైపు నడిపించాలని కోరారు.ఘటన జరగడానికి ముందు డిఎస్పీ వ్యవహరించిన తీరును డీజీపికి తెలుపుతామన్నారు.రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లడానికి బీజేపీ,బిఆర్ఎస్ నాయకులు ఇలాంటి హింసాత్మకమైన ఘటన జరగడానికి కారకులైనారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

చదువుతో పాటు నైపుణ్యం సాధించాలి

నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు చదువుతోపాటు నచ్చిన రంగంలో నైపుణ్యాలు పెంపొందించుకున్నప్పుడే ఉద్యోగాలు సాధించగలుగుతారని తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సమన్వయకర్త సాయికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్ కేసి ఆధ్వర్యంలో టాస్క్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టాస్క్ ద్వారా టెక్నాలజీ, ప్లేస్మెంట్, ముఖాముఖి విధానాలపై విద్యార్థులకు వివరించారు. టాస్క్‌లో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 360, బీసి, ఓసి విద్యార్థులు రూ. 710 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు తమ డిగ్రీ కోర్స్ కాల పరిమితితో ఈ కోర్సు పూర్తి చేసుకోవచ్చు అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. జె.సంగీత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు స్కిల్ ఓరియెంటెడ్ లాంటి ట్రైనింగ్స్ ద్వారా ఉద్యోగ నైపుణ్యాలను సాధించగలరన్నారు. టాస్క్‌లో రిజిస్ట్రేషన్ కొరకు కళాశాలలోని టీఎస్ కేసీ మెంటార్ ఎండి.ఇమ్రాన్ అలీని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో టిఎస్ కేసి కోఆర్డినేటర్ డాక్టర్. టి.అరుణ్ కుమార్, మెంటర్ ఎండి. ఇమ్రాన్ అలీ, టాస్క్ రిసోర్స్ పర్సన్ సాయికుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన : డిప్యూటీ సీఈఓ

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని కోడద్ గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ కలిందిని పరిశీలించారు. అనంతరం సుంకిడి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొని గ్రామంలోని పలు విధులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇండ్ల పరిసరాల్లో చెత్తచెదారం నిల్వ లేకుండా చూడాలని గ్రామస్తులను కోరారు. అదేవిధంగా ఇండ్లలో నీరు నిల్వ ఉంచకుండా రోడ్లపై చెత్తచెదారం వేయకుండా డస్ట్ బిన్‌లను వినియోగించాలని సూచించారు. గ్రామంలో శుభ్రంగా లేనిపక్షంలో నోటీసులు జారీ చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. డోర్లీ గ్రామంలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని జెసిబి ట్రాక్టర్ సాయంతో తొలగించారు. డిప్యూటీ సీఈఓ వెంట శేఖర్, సుధీర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఉమా, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | సెప్టెంబర్ 06, 2024 | www.navatelangana.com

సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



విద్యావేత్త, భారత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ నాయకుడు అజ్మీరా రామ్ నాయక్ అన్నారు. గురువారం తెలంగాణ సాంఘిక సంక్షేమ కాగజ్‌నగర్ బాలికల గురుకుల విద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. అంతకు ముందు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ సమీర్, ముఖిద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో గంజాయి అమ్ముతున్న వ్యక్తులు అరెస్ట్

నవతెలంగాణ-నిర్మల్



నిర్మల్ జిల్లా కేంద్రంలో గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివరాలు వెల్లడించారు. గురువారం ఉదయం ముందస్తు సమాచారం ప్రకారం, పట్టణ ఎస్ఐ రమేష్, వారి సిబ్బందితో కలిసి నిర్మల్‌లోని స్థానిక మంచిర్యాల చౌరస్తా లో గల చాచా టీ సెంటర్ వద్ద ఉండగా, చౌస్ అబ్రార్, షేక్ రఫాయి అను వ్యక్తులు ఒక ప్లాస్టిక్ కవర్‌లో విడి గంజాయి తీసుకొని కస్టమర్‌లకు అమ్ముదామని వెళ్ళుతుండగా పట్టుకున్నారు. ఇద్దరి వద్ద నుండి సుమారు కిలో 200 గ్రాముల గంజాయి స్వాధీనపరచుకొని ఇద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

విజ్ఞానాన్ని పంచుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి

- డీఈఓ అశోక్
- 52 మంది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచుతూ ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీఈఓ అశోక్ అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకోని గురువారం జిల్లా సమీకృత కార్యాలయంలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవం కార్యక్రమానికి డీఈఓ పాల్గొని రాధాకృష్ణ, సరస్వతి దేవి చిత్ర పటాలకు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను భావిభారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. దేశ సంస్కృతిలో తల్లిదండ్రుల తర్వాతి స్థానాన్ని గురువుకు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రపంచంలో శాస్త్ర సంకేతిక రంగంలో ముందుకు వెళ్తున్నామంటే చిన్ననాటి నుండి ఉపాధ్యాయులు నేర్పిన పాఠాలేనని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసేది ఉపాధ్యాయులేనని అన్నారు. కేవలం పాఠ్యాంశాలు బోధించడమే కాకుండా జీవిత పాఠాలతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటు పడాలన్నారు. అనంతరం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 52 మంది ఉపాధ్యాయులను పూలమాల శాలువ, పురస్కరంతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఓ శ్రీనివాస్, ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం...

జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆసిఫాబాద్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులు సూర్యమణి, హిమబిందు, సీహెచ్. ప్రకాష్, జె. గోవిందరావు, జె.సంతోష్, టి.సత్యనారాయణ, నిజాముద్దీన్లను జిల్లా విద్యాశాఖాధికారి పార్శి అశోక్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందజేశారు. ఉపాధ్యాయుల సేవలని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఉదయ్‌బాబు, లయన్‌క్లబ్ జోనల్ ఛైర్మన్ నాంపల్లి శంకర్, కార్యదర్శి కాంద్రె విశాల్, క్లబ్ డైరెక్టర్లు వెంకట రమణారెడ్డి, ఇరుకుల్ల ఆంజనేయులు, రావుల వినాయక్ రావు, పుల్లూరి శంకర్, వెంకటేశ్వరు, సంజయ్‌కుమార్, మమతా రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలోనూ మార్కండేయ ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రకాష్, రవికుమార్‌కు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందించారు.

నిలిచిన ఇంటర్‌నెట్ సేవలు

- ఇబ్బందుల్లో ప్రజలు
- సోషల్ మీడియాపై పోలీసుల నజర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని జైనూర్‌లో బుధవారం చోటు చేసుకున్న ఘర్షణల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం పెరుగుతున్న సామాజిక మాధ్యమాల ప్రభావంతో ఘర్షణ వాతావరణం పెరిగే అవకాశం ఉందని గ్రహించిన పోలీసులు ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేశారు. ప్రజలు ప్రతిరోజు సమాచారాన్ని చేరవేసుకోవడానికి ఉపయోగపడే ఇంటర్‌నెట్ పనిచేయకపోవడంతో జిల్లాలో ప్రజలు ఇబ్బందులు పడుతుండటం కనిపించింది.

నిలిచిన ఇంటర్‌నెట్ సేవలు...


జిల్లాలోని అన్ని మండలాల్లో ఇంటనెట్ సేవలను పోలీసులు నిలిపివేశారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలైన తహసీల్దార్, పోస్టల్ కార్యాలయాలతో పాటు బ్యాంకులు మాత్రమే పని చేశాయి. మిగతా చోట్ల ఇంటర్‌నెట్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇంటర్‌నెట్ సేవలు పనిచేయక పోవడంతో కలెక్టరేట్‌లో అన్ని విభాగాల అధికారులు ఓకే వైఫైతో ఒకేచోట పనిచేస్తూ కనిపించారు.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు...

ఇంటర్నెట్ సేవలపై ఆధారపడి అనేక కార్యాలయాలు వ్యాపారాలు కొనసాగుతున్న వేళ వాటిని తాత్కాలికంగా నిలిపివేయడంతో జిల్లాలో ప్రజలు ఇబ్బందులు పడటం కనిపించింది. వ్యాపారాలకు సంబంధించి ఫోన్ పే, గూగుల్ పేలు పని చేయకపోవడంతో పలుచోట్ల గిరాకీలు తగ్గినట్లు వ్యాపారస్తులు తెలిపారు.

సోషల్ మీడియాపై పోలీసుల నజర్...

ఘర్షణ వాతావరణం తలెత్తిన నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో ఎటువంటి వీడియోలు పోస్ట్ చేయకుండా పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. పెరుగుతున్న సామాజిక మాధ్యమాల ప్రభావంతో అల్లర్లు పెరిగే అవకాశం ఉందని ఇంటలిజెన్స్ నివేదిక నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేశారు. ఇదే సందర్భంగా ఎవరైనా సామాజిక మాధ్యమాల్లో ఘర్షణ వాతావరణం తలెత్తే విధంగా పోస్టులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఏది ఏమైనా ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేయడంతో పరిస్థితులు త్వరగా అదుపులోకి వచ్చినట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు.



విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరం..!

- ఆందోళన కలిగిస్తున్న ఉపాధ్యాయుల తొలగింపు నిర్ణయం
- బోధన కొనసాగడంపై సందిగ్ధం



గురుకులాల్లో పనిచేస్తున్న తాత్కాలిక ఉపాధ్యాయులు, ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయులను తొలగిస్తే పాఠాలపై ప్రభావం చూపుతుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క తమను ఉద్యోగంలోకి తొలగించడంతో కుటుంబ పరిస్థితులు ఏంటని తాత్కాలిక ఉపాధ్యాయుల్లోనూ ఆవేదన వ్యక్తమవుతోంది. ఆయా గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందిని తొలగిస్తూ గురుకుల విద్యాలయాల కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేయడం ఉమ్మడి జిల్లాలో సర్వత్రా చర్చకు దారితీస్తోంది.

నవతెలంగాణ-సిర్పూర్(టి)

జిల్లావ్యాప్తంగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 18 నుంచి 20 సంవత్సరాల నుండి పనిచేస్తున్న పార్ట్ టైం టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో ఐదు గురుకుల విద్యాలయాల్లో సుమారు 3000 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు, వీరికి విద్య బోధన చేయుటకు సుమారు 100 మంది గురుకుల పార్ట్ టైం టీచర్లు, అసిస్టెంట్ కెరీటేకర్, స్పెషల్ టీచర్లు, నాన్ టీచింగ్ పార్ట్ టైం ఉద్యోగులను నియమించగా.. తాజాగా వీరందరిని విధుల నుంచి తొలగిస్తుండటంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉపాధ్యాయుల తొలగింపు వ్యవహారం విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పాఠ్య ప్రణాళికల బోధనకు ఆటంకం

ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో ఉపాధ్యాయ, ఉద్యోగుల బదిలీ ప్రక్రియ సుమారు రెండు నెలలు పాటు కొనసాగింది.దీనివలన బోధనకు ఆటంకం ఏర్పడింది. గతంలో గురుకుల సొసైటీలో టీచర్ల భర్తీ కోసం జరిగిన నియామకాల్లో ఉద్యోగాలు పొందిన వారికి పట్టణ ప్రాంతాల్లో పోస్టింగ్‌లు కేటాయించారు. మారుమూల జిల్లాలో ఉన్నటువంటి గురుకులాల్లో ఖాళీ పోస్టులను మాత్రం భర్తీ చేయలేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 90శాతం పార్ట్ టైం టీచర్లచే విద్య బోధన జరుగుతుందంటే ఆశ్చర్యపోనవసరం లేదు. శాశ్వత ప్రతిపాదికన నియామకాలు జరపకుండా ఉపాధ్యాయులను తొలగించడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రెగ్యూలర్ ఉపాధ్యాయుల మాదిరిగానే సేవలందిస్తూ విద్యార్థుల ఉన్నతికి కృషిచేసిన తమ పట్ల ప్రభుత్వం ఇలా వ్యవహరించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీలను భర్తీ చేయాలి

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాలయాల్లో ఖాళీలను విద్యా సంవత్సరం ఆరంభంలోనే భర్తీ చేయాల్సి ఉంటుంది. కానీ విద్యా సంవత్సరం మధ్యలో భర్తీ చేయడం మూలంగా ఇది వరకే పనిచేస్తున్న వారిని తొలగించడంతో వారికి అన్యాయం జరుగుతోందనే భావన వ్యక్తమవుతోంది. కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయాలనే ప్రభుత్వం నిర్ణయం బాగున్నా. ఈ ప్రక్రియ పూర్తిచేసిన తర్వాత నిర్ణయం తీసుకుంటే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సీఓఈ గురుకులాల తొలగింపు

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల కార్యదర్శి సీవోఈ గురుకులాలను ఎత్తివేయాలని ఆలోచనలో ఉన్నారని సమాచారం వ్యక్తమవుతోంది, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అదిలాబాద్, బెల్లంపలిల్లో సీఓఈ కళాశాలలున్నాయి. నీట్, ఐఐటీ, మెడికల్ కోర్సులకు ముందుగానే శిక్షణ ఇస్తారు. సీఓఈ పాఠశాలను ఎత్తివేయడంతో పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షలా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో ఈ గురుకులాల్లో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారు. ప్రభుత్వ నిర్ణయం పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆటంకం కలిగిస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సివిల్ సప్లయి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సివిల్ సప్లయి విభాగంలో పనిచేస్తున్న హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దివాకర్‌తో కలిసి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించినంతరం కలెక్టరేట్ ఏఓ మధుకర్, సివిల్ సప్లయి డిఎం నరసింహరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల రేట్లు పెంచడానికి ఏడు నెలల నుండి నిరసన కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెరుగుతున్న రేట్లకనుగుణంగా క్వింటాలకు రూ.40 చేయాలని కోరారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. దసరా పండుగకు ఇచ్చే పండగ మొత్తాన్ని రూ.800 నుండి రూ.1200కు పెంచాలని కోరారు. బోనస్ రూ.6,500 నుండి రూ.10000కు పెంచాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇచ్చిన హామీ మేరకు హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ఇదే విధానాన్ని కొనసాగిస్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతి కాంగ్రెస్‌కు కూడా పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్ నాయకులు రాజన్న, దత్తు, దివాకర్, మోహన్, నవీన్ పాల్గొన్నారు.

జైనూర్ ఘటనపై సీతక్క వ్యాఖ్యలు బాధాకరం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై జరిగిన లైంగికదాడి ఘటనపై మంత్రి సీతక్క వ్యాఖ్యలు బాధాకరమని సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు అన్నారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ మహిళపై లైంగికదాడి యత్నం జరిగి నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసులు ఆందోళన చేస్తుంటే, వారి మనోభావాలు కించపరిచేలా మంత్రి సీతక్క అక్కడ అసలు ఏమి జరగలేదని మాట్లాడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నింధితునిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, లైంగికదాడి, హత్యా యత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

గృహ నిర్బంధంలో ఎమ్మెల్యే

ఎమ్మెల్య హరీష్ బాబును ఉదయం నుండే పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఎమ్మెల్యే హరీష్ బాబు జైనూర్‌కు వెళ్లకుండా ఉండేందుకు టౌన్ సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో ఎస్సైలు సుధాకర్, రాజులు సిబ్బంది తో పహారా కాశారు.

మహిళ మోర్చా ఆధ్వర్యంలో రాస్తారోకో

బీజేపీ మహిళ మోర్చా ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌టీఆర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. సుమారు గంట పాటు రాస్తారోకో చేయడంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. జైనూర్ ఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు వలపదాసు శ్రీదేవి, పట్టణ మహిళా అధ్యక్షురాలు చిప్ప మౌనిక, బీజేపీ పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్ పాల్గొన్నారు.



మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, జిల్లాలో ఆదివాసీ మహిళకు అన్యాయం జరిగితే వారిని పరామర్శించడానికి వెళుతున్న క్రమంలో ఆదివాసీ ఎమ్మెల్యే అయిన తనను అడ్డుకోవడం సరైన విధానం కాదని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జైనూర్ సంఘటన నేపథ్యంలో పరిస్థితి సమీక్షించేందుకు వెళ్తున్న క్రమంలో పోలీసులు కెరమెరి వద్ద ఆమెను అడ్డుకొని ఆసిఫాబాద్ తన నివాసానికి తరలించగా తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీ మహిళకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకోవడానికి వెళ్తున్న క్రమంలో తనను అడ్డుకోవడం సరైన విధానం కాదన్నారు. సంఘటన జరిగినప్పుడు పోలీసులు అల్లర్లు ఆపే విధంగా చూడాలని ఆదివాసీ నాయకులతో మాట్లాడాలని జిల్లా అధికారులు తనను సంప్రదించారని అదే క్రమంలో హైదరాబాద్ ఆస్పత్రి నుండి వచ్చి పరిస్థితి చక్కదిద్దడానికి వెళ్తున్న క్రమంలో అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ మధ్యలో గొడవలు జరిగినప్పుడు కూడా అసలైన నిందితులను వదిలేసి అమాయకులపై కేసులు పెట్టారని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలు సరిగ్గా లేవని, పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఇటువంటి సంఘటనలు జరిగిన ఆ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని భద్రత పెంచడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చి ఆదివాసుల మీద పెత్తనం చెలాయించడం తగదన్నారు. ఆదివాసులు ఓపికతో ఉండాలని కోరారు. నిందితులను కఠినంగా శిక్షించి బాధితురాలికి న్యాయం చేసే దిశగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘర్షణ జరిగిన ప్రాంతంలో 144 సెక్షన్ పెట్టడం పరిస్థితి చక్కబడదని, ఇరు వర్గాలతో చర్చించడంతో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు సరస్వతి పాల్గొన్నారు.



జైనూర్ బాధితురాలికి న్యాయం చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కుశాన రాజన్న



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని జైనూర్‌లో జరిగిన సంఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కుశాన రాజన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన యువతికి జరిగిన సంఘటన భాదాకరమన్నారు. నిందితుడిని కటినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. భాధితురాలికీ ఐదు ఎకరాల సాగుభూమి, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆధివాసులపై దాడులు జరగడం పరిపాటిగా మారిందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ వ్యవస్థ కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రస్తుతం జరిగిన సంఘటనకు బీజేపీ, ఎంఐఎంలు మతం రంగు పులమడం సరికాదని, గతంలో మంచిర్యాల జిల్లాలోని కోయపోచ గూడెంలో సంఘటన జరిగినప్పుడు ఈ పార్టీలు ఎటు వెళ్ళాయని ప్రశ్నించారు. ప్రస్తుత సంఘటన మతం రంగు పులమకూడదని సూచించారు. బాధితురాలికి ప్రభుత్వం అండగా ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్, జిల్లా నాయకులు కోట శ్రీనివాస్, రాజేందర్, కార్తీక్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : జైనూరు మండలంలో గిరిజన మహిళపై హత్యయత్నాకి పాల్పడిన దుండగున్ని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జైనూరు మండలానికి చెందిన మహిళాలపై ముగ్దం అనే వ్యక్తి హత్య ప్రయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టుకు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రభుత్వ పరంగా బాదిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఆదివాసులపై రోజు రోజుకు దాడులు పెరుగుతున్న తరుణంలో చట్టాను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. చట్టాలు సక్రమంగా అమలు చేయకపోవడంతోనే దాడులు పెరుగుతున్నాయని, దాడులను నివారించడానికి చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంట గోపాల్, శ్రీనివాస్, హనుమంతు, భీంరావు, సత్తయ్య, పవన్, రమేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలో జైనూర్ సంఘటన నేపథ్యంలో గురువారం మండల బంద్ నిర్వహించారు. ముందస్తుగా దుకాణాల దారులు బంద్‌లో పాల్గొన్నారు. ఎలాంటి సంఘటనలు జరకుండా ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. వద్దంతులను నమొద్దని ఈ సందర్భంగా ఎస్సై సూచించారు.

గురుకుల అటెండర్ విధుల నుండి తొలగింపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపులే బాలుర గురుకుల పాఠశాలలో అవుట్ సోర్సింగ్‌పై అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఖలీమ్‌ను విధుల నుండి తప్పించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మంగ తెలిపారు. ఖలీమ్ అటెండర్ మాత్రమే అయిన ఆఫీస్ సబ్ ఆర్డినేట్‌గా వ్యవహరిస్తూ, సీట్ల కోసం వచ్చే విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుండి డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై పలువురు ఎమ్మెల్యే హరీష్ బాబుకు ఫిర్యాదు చేయడంతో ఆయన గురుకుల కార్యదర్శి సైదులుకు ఫిర్యాదు చేశారు. దీంతో కార్యదర్శి ఆదేశాల మేరకు జిల్లా కో ఆర్డినెటర్ శ్వేత అటెండర్ ఖలీమ్‌ను విధుల నుండి తొలగించినట్లు ప్రిన్సిపాల్ మంగ తెలిపారు.

పోలీసుల సూచనలు పాటించాలి

నవతెలంగాణ-మందమర్రి

గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ రాజశేఖర్ కోరారు. గురువారం పోలీస్ స్టేషన్ ఆవరణలో మత పెద్దలు, పీస్ కమిటీ సభ్యులు, వినాయక చవితి ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వినాయక చవితి వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. నిర్వాహకులు ఆచరించాల్సిన జాగ్రత్తలు నిబంధనలను వివరించారు. మండపాల వద్ద నిమజ్జనం రోజున డీజేను ఏర్పాటు చేయరాదని తెలిపారు. ఇతర మతస్తులను కించపరిచే ప్రసంగాలు, పాటలు పాడడం చేయకూడదన్నారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కన్పిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే వదంతులను నమ్మవద్దని, మండపంలో ఒకరు ఇద్దరు వాలంటీర్లు నిత్యం అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. పండుగను అందరూ స్నేహపూర్వక వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్‌కు షాక్... కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

నవతెలంగాణ-కాసిపేట



మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు భారీగా కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్‌కు తీవ్ర నష్టం నెలకొంది. వీరికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ వైస్ ఎంపీపీ పుస్కూరి విక్రమ్ రావు, ఓరియంట్ సిమెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీటీసీలు అట్టపెల్లి శ్రీనివాస్ సుమలత, గుడిసెల భీమయ్య, బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్లు వడ్లూరి మల్లేష్, మద్దివేణి వేణు, యూనియన్ కోశాధికారి శ్యామ్‌సింగ్, మాజీ వార్డ్ మెంబర్ మల్లెత్తుల సందీప్, బద్దం రాజేశ్వర్ రెడ్డి, శ్రీపతి ప్రవీణ్, మధు, నామసాని రాజు, కొమ్ము సతీష్, యాదవ సంఘం పెద్దలు మారం లక్ష్మయ్య, వేల్పుల రవి, వేల్పుల పోషం, యూత్ ప్రెసిడెంట్ మర్రిపెల్లి ప్రశాంత్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

గురువులకు ఘన సన్మానం

నవతెలంగాణ-జైపూర్

మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గురువులను ఘనంగా సన్మానించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధ కృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులుగా తరగతి గదుల్లో విద్యాబోధన చేశారు. ఈ సంధర్భంగా ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు తమ అనుభవాలను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులతో పంచుకున్నారు. షెట్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మేడి రవి ఆధ్వర్యంలో మాజీ జెడ్పీటీసీ మేడి సునిత ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. అదే విధంగా మండల పరిధిలో గల వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘణంగా జరుపుకున్నారు..

భీమారంలో...

మండలంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరింకుని సర్వేపల్లి రాధ కృష్ణన్‌కు ఘన నివాళు లర్పించారు. సమాజంలో గురువులకు గల ప్రాధ్యానతను గుర్తు చేసుకున్నారు. మండల పరిధి వివిధ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు...

మందమర్రి : ఫిల్టర్ బెడ్ ఏరియాలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో గురువారం ఎస్‌బీఐ మేనేజర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్నారెడ్డితో కలిసి విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి ఉపాధ్యాయులకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం పిల్లలకు చాక్లెట్లు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు సోమశేఖర్ శ్రీనివాస్, ఎస్‌బీఐ బ్యాంకు ఫీల్డ్ అధికారి మహేందర్, సీనియర్ అసిస్టెంట్ అశోక్ పాల్గొన్నారు.

తాండూర్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల చెందిన ఉపాధ్యాయులు జి ప్రకాష్, బి జయప్రద, సిహెచ్ మల్లయ్య, ఎంవీఎస్ కుమార్, కే కగపతి, జే అశోక్, బి.లత, బి.సరోజ, టి.ఉమామహేశ్వరి, ఎంఈఓ వాసాల ప్రభాకర్‌ను మండల విద్యాధికారి కార్యాలయంలో శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ బొమ్మ బాపురెడ్డి, కార్యదర్శి ఠాకూర్ ఉగ్రావు సింగ్, కోశాధికారి మద్దికుంట రామచందర్, జోనల్ చైర్మెన్ రౌతు వెంకటేశం, ఉపాధ్యక్షులు దేవరకొండ రాజన్న, సిరంగి శంకర్, తాళ్లపల్లి దిలీప్ గౌడ్, ఎలుక రామచందర్, సాంబమూర్తి పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు సీఎస్ఐ రైడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తరగతి గదులలో బోధించారు. తరగతుల నిర్వహణ అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులను ఉపాధ్యాయ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్.డేవిడ్ పాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జన్నారం : మండలంలోని ఇందన్‌పల్లి జిల్లా పరిషత్ స్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రాజేందర్, ఉపాధ్యాయులు తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మంచిర్యాల సఖి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బండ శాంకరి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సంధర్భంగా ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పుష్పలత, ఉపాధ్యాయులు పల్లె కృష్ణ గోపాల్ రావు, జ్యోతి, మాధవి లత, తిరుపతి, చంద్రశేఖర్ ను సన్మానించారు. కార్యక్రమంలో సఖి లయన్స్ క్లబ్ కోశాధికారి అట్ల భాగ్య లక్ష్మీ, బోర్డు మెంబర్ జట్టి లత పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సాంబమూర్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. కాసిపేట పాఠశాల స్కూల్ అసిస్టెంట్ వేణు వద్ద గతంలో విద్యభ్యసించిన పూర్వ విద్యార్థులు నేడు ధర్మారావుపేట స్కూల్ అసిస్టెంట్ గంప శ్రీనివాస్, ఎస్జీటీలు మామిడి జ్యోతి, కే రమేష్లు ఉపాధ్యాయులుగా సేవలు అందించడంతో గురువుకు శాలువాలతో సన్మానించారు.

మంచిర్యాల : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధకృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కళాశాలలోని అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి, అధ్యపకులు టి. గంగయ్య ఎం. కుమార స్వామి, రావికంటి గోపాలకృష్ణ, రాజయ్య అరుణ, నవీన్, జాడి మహేష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

దండేపల్లి : సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను పురష్కరించుకుని మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలే ఉపాధ్యాయులై తమ తోటి విద్యార్తులకు బోదించారు. ద్వారకా ఉన్నత పాటశాలలో విశ్రాంత ఉద్యోగులు అన్నం సత్యనారాయణ, పసర్తి సత్తయ్యలను గుడిరేవు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌ను సన్మానించారు.

మందమర్రి : భారత రత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం లిటిల్ ఫ్లవర్స్ హై స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలని విద్యార్థిని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల కరెస్పాండంట్ దామెర్ల సిద్ధయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమ, వైస్ ప్రిన్సిపాల్ కార్పె ప్రవీణ్, క్లర్క్ పద్మ, ఉఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జైపూర్ : పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు







ఉత్తమ ఉపాధ్యాయురాలిగా శ్రీలక్ష్మి



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని మాదారం టూ పాఠశాలలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ప్రధానోపాధ్యాయులు శ్రీలక్ష్మి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఆమె గురువారం కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. మాదారం టూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడం, ఆటపాటలతో కూడిన గుణాత్మక విద్యను అందిస్తున్నందుకుగాను ఎంపిక చేశారు. రెండేళ్లలో పిల్లల సంఖ్య 2 నుంచి 21కి పెంచి ప్రజలు, పై అధికారుల అభిమానం చూర గొన్నారు. ఆమె రాసిన అంతర్లీనం వచన కవితా సంపుటి గత సంవత్సరం వెలువరించారు. విద్యార్థులకు ఊయోగపడేలా ఆమె రాసిన పాటలతో అంతస్మితం డిసెంబర్‌లో వెలువరించారు. తనకున్న అవకాశాలని సద్వినియోగం చేసుకుంటూ కవిగా రాణిస్తూ పిల్లల భవిష్యత్తు పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక కావడం పట్ల తోటి ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు అనపర్తి యువరాజ్ అన్నారు. గురువారం జిల్లా విద్యాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల వేమనపల్లి మండలంలోని రాజారం మంగినపల్లి ఎంపీపీఎస్ ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదన్నారు. పాఠశాల సమయంలో వ్యక్తిగత పనులు నిర్వహించుకుంటున్నారని పత్రికల్లో వచ్చినా ఆ పాఠశాల హెచ్‌ఎం, మండల విద్యాధికారి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. పాఠశాలకు సమయపాలన పాటించడం లేదని స్వయంగా తానే పత్రికలకు చెప్పడం, ఉన్నతాధికారులు ఆమెపై చర్యలు తీసుకోకపోవడం శోచనియమన్నారు. జిల్లా అధికారులు స్పందించి సమయపాలన పాటించని చర్యలు తీసుకోని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఏముర్ల వరుణ్, గౌతమ్ పాల్గొన్నారు.

ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన

నవతెలంగాణ-కాసిపేట

ఆదివాసీ మహిళపై లైంగికదాడి చేసి హత్యాయత్నం చేసిన మాగ్దుమ్‌ను ఉరిశిక్ష వేయాలని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని దేవాపూర్‌లో ఆందోళన చేశారు. రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేపట్టి నినాదాలు చేశారు. అనంతరం సీఐ శశిధర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ జైనూర్ మండలంలోని దేవుగూడ చెందిన ఆదివాసీ మహిళపై లైంగిక దాడి చేసి హత్య చేసేందుకు ప్రయత్నించిన నిందితుడిని ఉరి తీయాలని డిమండ్ చేశారు. కోల్‌కత్త సంఘటన మరువక ముందే ఇలాంటి ఘటనలు జరగడం సిగ్గు చేటని, దేశమంతా ఓ పక్క ఆందోళన కార్యక్రమం చేపడుతుంటే మరో పక్క ఆదివాసీ మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదన్నారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు గాడే జంగు, పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, కొమ్ముల బాపు, సంద్ర భూమయ్య కనక రాజు, మడావి అనంతరావు, కనక గోవర్ధన్, సిడాం శంకర్, పెంద్రం ప్రభాకర్, పెంద్రం సింగు, మడావి గంగారం పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : గిరిజన మహిళపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని అంబెడ్కర్ మండల అధ్యక్షులు ముల్కల్లా రాందాస్ అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో గిరిజన మహిళపై జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తూ గురువారం మండల అంబెడ్కర్ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ ఆదివాసీ మహిళపై హత్యాచారం చేసిన నిందితున్ని ఫాస్ట్ ట్రక్ కోర్టు ఏర్పాటు చేసి ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి ఉరితీయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు దొంత నర్సయ్య కార్యదర్శి రవి, కౌన్సిలర్లు సాతరాజి రాజన్న, సురేష్ నాయక్, మేకల బానేశ్, అడ్లూరి దేవయ్య పాల్గొన్నారు.

దండేపల్లి : ఆదివాసీ మహిళపై లైంగిక దాడికి పాల్పడిన హత్యయత్నం చేసిన వ్యక్తిని ఉరితీయాలని ఆదివాసీ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పెంద్రమ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు ఇచ్చిన మండల బంద్ ప్రశాంతంగా ముగిసింది. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకులు కనక జంగు, నాయకపూర్ సేవా సంఘం నాయకుడు మరినేని భూమేష్, సేదం బాపు, హాయ్ కులు, కొమరం శంకర్, నరేందర్, హనుమంతు పాల్గొన్నారు.

పంటల సంరక్షణకు యాజమాన్య పద్ధతులు

నవతెలంగాణ-నస్పూర్

ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాల నుండి పంటల సంరక్షణకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాలలో పొలం నుండి మురుగు నీటిని తీసివేయాలని, రాబోవు 2 రోజులలో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట పొలాల్లో మందులను పిచికారి చేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలని తెలిపారు. ప్రస్తుతం ఎడతెరపి లేని వర్షాల నేపథ్యంలో పంటల సంరక్షణకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తూ అధిగ దిగుబడి సాధించి లబ్ది పొందాలని ఆకాంక్షించారు.

కార్మికుల మదిలో కొలువైన నేత మనుబోతుల కొమురయ్య

- ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి గని కార్మికుల మదిలో కొలువైన నేత మనుబోతుల కొమురయ్య అని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా అన్నారు. మనుబోతుల కొమురయ్య 28వ వర్ధంతిని గురువారం ఇందారం-1ఏ గని ఆవరణలో జరుపుకున్నారు. గని పిట్ కార్యదర్శి చింతల నవీన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై కొమురయ్య చిత్రపటానికి కార్మికులతో కలిసి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి గనుల పుట్టిల్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రస్తుతం భద్రాది కొత్తగూడెం ఇల్లందులో 1928 జూన్ 12న మనుబోతుల కొమురయ్య జన్మించారని గుర్తు చేశారు. చిన్నతనంలోనే వామపక్ష సాహిత్యం, కరపత్రాలు చదివి బొగ్గు గని కార్మికుల కష్టాలను కళ్లారా చూసి చలించిపోయిన ఆయన కార్మికులకు అండగా నిలిచారని తెలిపారు. 1940 సంవత్సరంలో కొత్తగూడెం మెయిన్ వర్క్‌షాపులో టర్నర్‌గా సింగరేణిలో ఉద్యోగ ప్రస్థానం మొదలు పెట్టి ఆనాటి కార్మిక సంఘం నాయకులు దేవుని శేషగిరి రావు, ముగ్దుమ్ మొయినుద్దీన్, రాజ బహాదూర్, కేఎల్ మహేంద్రలతో కలిసి అనేక పోరాటాలు చేశారన్నారు. 1942 మే 1న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియ్ ఏఐటీయూసీ స్థాపించిన వారిలో మనుబోతుల కొమురయ్య ఒకరని, సింగరేణి కార్మికుల హక్కులతో పాటు నిజాం రాజుకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో చురుకుగా పాల్గొని 1947 నుండి 1948 వరకు జైలు జీవితం అనుభవించారన్నారు. 44 సంవత్సరాలు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌కు ప్రధాన కార్యదర్శిగా పని చేసి తన ఇంటి పేరును యూనియన్ కొమురయ్యగా పిలిపించుకున్న నాయకుడని తెలిపారు. కార్మిక నాయకునిగా ఆయన చేసిన పోరాటం, సాధించుకున్న హక్కులను వివరిస్తూ కార్మికుల కోసం పరితపించిన ఆయన స్ఫూర్తితో కార్మికుల శ్రేయస్సు, సంస్థ అభివృద్ధికి పాటుపడుదామన్నారు. కార్యక్రమంలో ఆఫీస్ బేరర్ నాగభూషణం, ఓసీ పిట్ కార్యదర్శి అగ్గు శ్రీకాంత్, కాంట్రాక్ట్ కార్మికుల బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, మైనింగ్ స్టాఫ్ వాయిస్ ప్రసిడెంట్ బాలకృష్ణ, రాజయ్య, సత్తయ్య, వెంకటస్వామి, సురేష్ బాబు, శ్రీకాంత్, జై సూర్య, వెంకటేష్, విజేందర్, రమేష్, కేశవ్, నరేష్, హనుమంతు పాల్గొన్నారు.

మందమర్రి : సింగరేణి కార్మికుల పెన్షన్ ప్రదాత, ఏఐటీయూసీ నాయకులు మనుబోతుల కొమురయ్య 28వ వర్ధంతిని గురువారం ఏరియాలోని గనులు డిపార్ట్‌మెంట్లపై నిర్వహించారు. కెకె-5 గని వద్ద ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్మికల సమక్షంలో కొమురయ్య చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కెకె ఓసీపీలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భీమ నాధుని సుదర్శన్, వర్క్ షాప్ లో బ్రాంచ్ జాయింట్ సెక్రెటరీ కంది శ్రీనివాస్, సహాయ కార్యదర్శి సోమిశెట్టి రాజేషం, సివిల్ డిపార్ట్‌మెంట్ స్టోర్స్‌లో బ్రాంచ్ నాయకులు పెద్దపల్లి బానయ్య ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. కార్యక్రమంలో కెకె5 పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, సీనియర్ నాయకులు దేవసాని సాంబయ్య, కాసం సమ్మయ్య, పిట్ సహాయ కార్యదర్శి ప్రేమ్ లాల్, మైన్ కమిటీ నాయకులు గోవిందుల రమేష్, మేకల సంతు, కెకెఓసీ పిట్ కార్యదర్శి మర్రి కుమారు, సీనియర్ నాయకులు ఆర్నకొండ ఆంజనేయులు, మైనింగ్ స్టాప్ నాయకులు గోపతి సత్యనారాయణ, ఓసీ ఇన్‌చార్జి రాజేష్ యాదవ్ పాల్గొన్నారు.

కాసిపేట : మందమర్రి ఏరియాలోని కాసిపేట 2 గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక నాయకుడు మనుబోతుల కొమురయ్య 28వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, పిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, వర్క్ మెన్ ఇన్స్‌పెక్టర్లు సుభాష్ చంద్రబోస్, రాజకుమార్, పిట్ కమిటీ సభ్యులు, నాయకులు కేతన్, హౌస్సేస్ కార్మికులు పాల్గొన్నారు.

నస్పూర్ : సింగరేణి కార్మికుల చీకటి బతుకుల్లో వెలుగులు నింపిన మహా నాయకుడు కొమురయ్య అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య,శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా అన్నారు. కొమురయ్య 28వ వర్ధంతి సందర్భంగా గురువారం శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు డిపార్ట్‌మెంట్లలో వారి వర్ధంతి సభలను నిర్వహించి అనంతరం నర్సయ్య భవన్‌లో వర్ధంతి సభను ఏర్పాటు చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, మైనింగ్ స్టాఫ్ కార్యదర్శి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ కార్యదర్శులు గునిగంటి నరసింహారావు, బిర రవీందర్, చింతల నవీన్ రెడ్డి, అగు శ్రీకాంత్, నాయకులు సురేష్ జెపి రావు, భోగ మధునయ్య, గూడెపు రాజేష్ పాల్గొన్నారు.



జైపూర్ : నివాళులర్పిస్తున్న కార్మికులు







జల్సాల కోసం బైకుల దొంగతనం

- అరెస్ట్ చేసిన మంచిర్యాల పోలీసులు

నవతెలంగాణ-మంచిర్యాల

జల్సాలకు అలవాటై అక్రమంగా డబ్బులు సంపాదించాలనే కోరికతో గత కొన్ని రోజులుగా జిల్లాలో బైకు దొంగతనాలకు అలవాటు పడ్డ ఇద్దరు యువకులను మంచిర్యాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్ నిందితుల వివరాలు వెల్లడించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు ఆదేశాల మేరకు పట్టణంలో సాయంత్రం వాహనాల తనిఖీ చేస్తున్న సందర్భంలో అనుమానస్పదంగా వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని విచారించగా వారి పేర్లు నిమ్మల కుమార్ సున్నాం బట్టివాడ, నెల్లి సాయి కుమార్ కాగజ్‌నగర్ అని, వాహన పత్రాలు చెక్ చేయగా ఎటువంటి డాక్యుమెంట్‌లు లేవని, జల్సా లకు అలవాటు పడి గత కొన్ని నెలలుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిలిపి ఉన్న వాహనాలను దొంగిలించి, అమ్మకాలు నిర్వహిస్తున్నట్టు నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 4 బైకులు స్వాదీన పరుచుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నేరడిగొండ



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గురువారం ఎంపీడీఓ రాజ్‌వీర్ గ్రామస్తులకు తెలిపారు. గురువారం మండలంలోని కొరటికల్ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. వర్షాల వల్ల నీరు కలుషితం అయ్యే అవకాశాలున్నాయని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రవీందర్, ఎంపీఓ లక్ష్మణ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్య పరిష్కరించాలని రాస్తారోకో



నవతెలంగాణ-ముథోల్

తాగు నీటి కోసం మండలంలోని సరస్వతినగర్ వద్ద భైంసా బాసర రహదారిపై గురువారం గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. కొన్ని రోజుల నుంచి గ్రామాల్లో మిషన్ భగీరథ నుండి వాటర్ సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ విషయం గురించి సంబంధిత అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మిషన్ భగీరథ అధికారులు వచ్చేవరకు ఇక్కడి నుండి కదిలేదని భీష్మించి కూర్చున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ శివ కుమార్, తహసీల్దార్ శ్రీకాంత్, సీఐ మల్లేష్, ఎస్సై సాయికిరణ్ సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన కారులను సముదాయించారు. వెంటనే నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు .

ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతులు లేవు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జైనూర్ సంఘటన దృష్ట్యా ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎలాంటి సభలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతులు లేకుండా గుమిగూడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని మండలాల్లో 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ (144 సెక్షన్) అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. అన్ని మండలాలలో బంద్ ఉందంటూ ప్రచారం చేసిన, బంద్ చేయడానికి ప్రయత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం జైనూరు మండలం ప్రశాంత వాతావరణంలో ఉందని తెలిపారు. జైనూరు సంఘటనలో కారకులపై కేసులు నమోదు చేయడం జరిగిందని, దర్యాప్తు కొనసాగుతుందని పేర్కొన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రజలేవరూ గుంపులు గుంపులుగా తిరగడం, అనవసరంగా బయటకు రావడం చేయరాదని పేర్కొన్నారు. ఉద్రిక్తతలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ఇతరులను జైనూర్‌లోనికి అనుమతించడం జరగదని పేర్కొన్నారు. ప్రజలందరూ సంయమనం పాటించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వదంతులు నమ్మవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వదంతులను వ్యాప్తి చేసే వారిపై, గ్రూప్ అడ్మిన్‌లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

మండల కేంద్రంలో 144 సెక్షన్ అమలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రంలో గురువారం నుంచి 8 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకుని శాంతి భద్రతలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేర 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రభుత్వం కృషి

- మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

నవతెలంగాణ-కుభీర్

ముథోల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. కుల సంఘాల భవన నిర్మాణాలతో పాటు వివిధ పనులకు సంబందించిన రూ.2.40కోట్ల నిధులు మంజూరు కావడంతో వాటికి సంబంధించి ప్రొసిడింగ్ కాపీలను భైంసాలో గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముథోల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,జిల్లా ఇంచార్జ్ మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శంకర్ చవాన్, మాజీ ఎంపీపీ తూము లక్ష్మీ రాజేశ్వర్, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు మహిపాల్‌రెడ్డి,దత్తురం పటేల్, సురేష్,నాయకులు హైమద్, భూమన్న ఆనందరావు పటేల్, తదితరులు ఉన్నారు

గణపతి నవరాత్రి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

నవతెలంగాణ-జైపూర్

వినాయక చవితిని పురస్కరించుకుని గణపతి నవరాత్రోత్సవాలకరు పోలీస్ శాఖ నుండి అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని ఎస్సై శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన నిర్వాహకులు పోలీస్ శాఖ యాప్ ద్వార ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపర్చాలని సూచించారు. నిర్వాహకులకు సంబంధించిన పూర్తి వివరాలు, సంప్రదింపుల కోసం సెల్‌ఫోన్ నెంబర్, విగ్రహం ప్రతిష్టాపన, నిమజ్జనం తదితర విషయాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ బాసర జోన్ పరిధిలోని పలువురిని ఉత్తమ ఉపాధ్యాయులుగా, ఎంపిక చేసినట్టు కళాశాల సిఈఓ ప్రిన్సిపల్ లలిత కుమారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాసర జోన్ నుండి జోనల్ స్థాయిలో, ఉత్తమ ప్రిన్సిపల్‌గా లలిత కుమారి, ఉత్తమ ఉపాధ్యాయుల కేటగిరిలో బి.రమణిక, జేఎల్ తెలుగు, ఆర్.వేలంకన్ని జెఎల్ ఇంగ్లీష్, సి.గోదావరి టిజిటి మ్యాథ్స్ లు ఎంపికయ్యారని పేర్కొన్నారు. పబ్లిక్ పరీక్షల్లో సాధించిన ఉత్తమ ఫలితాలు, బోధనా సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకున్న అధికారులు, వివిధ కేటగిరీలలోని ఉపాధ్యాయులను ఎంపిక చేశారు.

మేకలకు, గొర్రెలకు పీపీఆర్ టీకాలు

నవతెలంగాణ-నేరడిగొండ

మేకలకు, గొర్రెలకు పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం సామూహికంగా పీపీఆర్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడారు. రైతులు, పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంపౌండర్, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే..!

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్

వ్యక్తిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఎమ్మార్సీ భవనంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తాతో కలిసి పాల్గొన్నారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగడానికి గురువులు నిరంతరం కృషి చేస్తారని అన్నారు. గురువులు అనేక మందిని డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, శాస్త్రవేత్తలుగా, పోలీసులుగా, రాజకీయ నాయకులుగా, మేధావులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. తాను ఓ ఆశ్రమ పాఠశాలలో, రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకొని ఎమ్మెల్యేగా ఎదగడానికి గురువులు అందించిన ప్రోత్సాహం మరవలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. గురుకులల్లో, కళాశాలలో మెరుగైన విద్యాను అందించేందుకు నిరంతరం పాటు పడుతుందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉట్నూర్



ఆదిలాబాద్‌టౌన్



లోకేశ్వరం



మంచిర్యాల



నిర్మల్

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ, ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ కెమిస్ట్రీ లెక్చరర్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అండ్ మోటివేషనల్ స్పీకర్ సల్లా విజయబాబు పాల్గొన్నారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం విద్యార్థులకు ఉపాధ్యాయుల పాత్రను వివరించారు. విద్యార్థులు ఉత్తమ గురువులను ఎంచుకొని జీవితంలో ఉన్నతమైన స్థానాలను అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు యాకూబ్‌అలి, పృథ్వీరాజ్, ఎన్సీసీ కేర్ టేకర్ చంద్రకాంత్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఘు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్ఎం ఆధ్వర్యంలో

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని ఆర్టీసీ ఆర్ఎం సొలొమాన్ అన్నారు. ప్రతినిత్యం ఆర్టీసీ బస్సులో ప్రయాణించే ఉపాధ్యాయులను ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సన్మానించారు. గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో వారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధ్యాయులు, పాఠశాలల విద్యార్థులు సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్.ప్రణీత్ సిబ్బంది ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో టీచర్స్ డే

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో టీచర్స్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంగీత పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులను గౌరవించాలని వారి ఉన్నత విలువలను ఆశయాలను తీసుకొని ఆచరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అష్రాఫ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో...

తరగతి గది నుంచి ఉపాధ్యాయుడు దేశ భవిష్యత్తును తయారు చేస్తాడని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని రిమ్స్ ఆడిటోరియంలో గురుపూజోత్సవం నిర్వహించారు. డైరెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికోలు డైరెక్టర్ తోపాటు పలువురు గురువులను సత్కరించి జ్ఞాపికలను అందించారు. అనంతరం మెడికోలు చేసిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ చీకటి నుంచి విద్యార్థులను వెలుగు తీసుకువచ్చే వాడే గురువు అని అన్నారు. ఎన్నో త్యాగాలు చేసి విద్యార్థుల జీవితాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతారన్నారు. ఒర్పు, సహనంతో ఉంటూ మంచి భవిష్యత్తును అందిస్తు అండగా ఉంటున్నారన్నారు. గురువులు విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉంటూ వారికి విద్య బుద్ధులు నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, వైస్ ప్రిన్సిపల్ విద్య విల్సన్, నర్సింగ్ ప్రిన్సిపాల్ సరోజ, వైద్యులు రామకృష్ణ, బండారి నరేందర్, సందీప్ జాదవ్, సిరీష్ పాల్గొన్నారు.

నిర్మల్ : ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రతిరోజు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయులను డిపోమేనేజర్ ప్రతిమారెడ్డి గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో విధులకు వెళ న్న వారికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాలతో సత్కరించారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ స్కూళ్లకు వెళ్లి పిల్లలకు మంచి భవిష్యత్తును అందచేస్తున్నందుకు అభినందనీయమని కొనియాడు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, స్టేషన్ మేనేజర్ ఏఆర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

లోకేశ్వరం : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని మన్మథ్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు మల్కాగౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రముఖ విశ్రాంత ఉపాధ్యాయులు మల్కారెడ్డి, రవీందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, గంగాకిషన్ (వార్డెన్) లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు ఉపన్యాసం, పాటల ద్వారా గురువుల గొప్పతనాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దేవేందర్, గంగాధర్, రాజేందర్, సుధీర్ కుమార్, గోదావరి, మాజీ సర్పంచ్, వీడీసీ చైర్మెన్ శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ లలితాభోజన్న, పుష్ప, వీడీసీ భోజన్న పాల్గొన్నారు.

నార్నూర్ : నార్నూర్, గాదిగూడ మండల కేంద్రాల్లోని కేజీబీవీ, ఆశ్రమ, ఆదర్శ ఏకలవ్య గురుకులం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా సెకండరీ పాఠశాలతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. కార్యక్రమంలో కళాశాల, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్ : మండల కేంద్రంతో పాటు సొనాల, పొచ్చర, దన్నూర్(బి) గ్రామాల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాగభూషణం, వేదం, విజ్ఞాన్, సెంట్ థామస్, సొనాలలోని ఉషోదయ, వివేకానంద పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళు లర్పించారు. ఉపాధ్యాయులు రాధాకృష్ణన్ గొప్పతనాన్ని వారి గురించి, విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుని పాత్ర గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఈర్ల గంగాధర్, కృష్ణ చైతన్య, కిషోర్, సంతోష్, ఉపాధ్యాయులు ఇస్తారి, శుద్ధోధన్, శ్రీధర్ పాల్గొన్నారు.

తాంసి : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం తాంసి, భీంపూర్ మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయ వేషధారణలతో తరగతి గదుల్లో పాఠాలు బోధించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు లక్ష్మీ, సత్యనారాయణ, ఎంపీడీఓలు మోహన్‌రెడ్డి, మండల విద్యాధికారి శ్రీకాంత్, ప్రిన్సిపల్ సుదర్శన్. ఉపాధ్యాయులు శ్రీనివాస్, సతీష్, ఉమామహేశ్వర్ అనిల్, సంతోష్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : అదిలాబాద్, మావల మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదిలో పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడెం : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించుకునే ఉపాధ్యాయుల దినోత్సవాన్ని మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠశాలలో పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఉత్సాహంగా పాల్గొని ఉత్తమంగా బోధించిన విద్యార్థి ఉపాధ్యాయులకు బహుమతి ప్రధానం చేశారు.

తలమడుగు : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదిలో పాఠాలు బోధించారు. పాఠశాల అటెండర్ నుండి ప్రధానోపాధ్యాయుడు వరకు ఒకరోజు విధులను నిర్వహించారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. సంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించుకున్నారు.

బేల : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఛాత్రోపాధ్యాయులుగా మారి పాఠాలను బోధించారు. ప్రిన్సిపల్ భగువాండ్లు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్పతానాన్ని వివరించారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్ర మైనదని, దేశ భవిష్యత్తును నిర్మించే వృత్తిలో ఉండడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

కుబీర్ : కుబీర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉన్న పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచిర్యాల : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకు మంచిర్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంచిర్యాల విద్యాశాఖాధికారి ఎస్.సధయ్య పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు దేశాభివృద్ధిలో బాగస్వాములు కావాలని, భావి తరాలకు ఉపయోగపడే విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులని కొనియాడారు. పాత మంచిర్యాల ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ మాలతిదేవి, సినిమా వాడ పాఠశాల ఉపాధ్యాయురాలు మహాలక్ష్మి, మురళిధర్, రాజ్‌కుమార్, సంతోష్‌లతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మంచిర్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాల్ మెహన్, ప్రోగ్రాం చైర్మెన్ హనుమంతరావు, చంద్రమౌళి, వి.మధుసుధన్ రెడ్డి, వినయ్ కుమార్, వేణు గోపాల్‌లతో పాటు ప్రభుత్వ ఉపాధ్యయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT ADILABAD
Dispute No. 244/2024
Between:
M/s Mayura Chit Funds Private Limited, Mancherial. ... DISPUTANT.
VERSUS
Mohd Rizwan & Others ... OPPONENTS.
To,
1. Mohammad Rizwan, S/o Md. Faheemuddin, Occ: Business, R/o H.No. 28-47, Angadi Bazar, Mandamarri, Dt. Mancherial. 504 231.
NOTICE
WHEREAS the Disputant M/s Mayura Chit Funds Private Limited, company, in the above Dispute has instituted the above dispute for recovery of money of Rs. 85,130/- and the same is posted for your appearance in the above said court on **24-09-2024 by 10.30 a.m.** If you failed to attend the said court on the said date, the matter will be heard and decided exparte.
// By Order of the Deputy Registrar of Chits, Adilabad//
Place:Mancherial.
Date: 03-09-2024.
Sd/-
M/s Mayura Cht Funds Private Limited Mancherial.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT ADILABAD
Dispute No. 245/2024
Between:
M/s Mayura Chit Funds Private Limited, Mancherial. ... DISPUTANT.
VERSUS
E.Hari Krishna & Others ...OPPONENTS.
To,
2. Erukonda Raja Shekar, S/o Mallesh, Occ: General Mazdoor, Gdk-9 incline, E.C.No. 1246803, R/o Q.No. D-186, 3rd zone, Mandamarri, Dt. Mancherial. 504231.
NOTICE
WHEREAS the Disputant M/s Mayura Chit Funds Private Limited, company, in the above Dispute has instituted the above dispute for recovery of money of Rs. 1,07,245/- and the same is posted for your appearance in the above said court on **24-09-2024 by 10.30 a.m.** If you failed to attend the said court on the said date, the matter will be heard and decided exparte.
// By Order of the Deputy Registrar of Chits, Adilabad//
Place:Mancherial.
Date: 03-09-2024.
Sd/-
M/s Mayura Cht Funds Private Limited Mancherial.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT ADILABAD
Dispute No. 246/2024
Between:
M/s Mayura Chit Funds Private Limited, Mancherial. ... DISPUTANT.
VERSUS
Nagelli Sadhi & Others .. OPPONENTS.
To,
4. Narvetla Venkata Swamy, S/o Hanumaiah, Occ: Gen Maz, KK-5, E.C.No 2388959, R/o H.No. 350/8, Krishna Colony, Mdl. Naspur, 504 302.
NOTICE
WHEREAS the Disputant M/s Mayura Chit Funds Private Limited, company, in the above Dispute has instituted the above dispute for recovery of money of Rs. 3,42,900/- and the same is posted for your appearance in the above said court on **24-09-2024 by 10.30 a.m.** If you failed to attend the said court on the said date, the matter will be heard and decided exparte.
// By Order of the Deputy Registrar of Chits, Adilabad//
Place:Mancherial.
Date: 03-09-2024.
Sd/-
M/s Mayura Cht Funds Private Limited Mancherial.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT ADILABAD
Dispute No. 226/2024
Between:
M/s Mohana Chit Funds Pvt. Ltd., Chennur. ... DISPUTANT.
VERSUS
N.Anjan Kumar & Others ... OPPONENTS.
To,
3. Peddapolu Manohar Goud, S/o Kista Goud, Age: 55 years, Occ: SGT, UPS Nagampeta, (1322904), R/o Vill: Nagampet, Mdl. Kotapalli, Dt. Mancherial-504214.
NOTICE
WHEREAS the Disputant M/s Mohana Chit Funds Pvt. Ltd., company, in the above Dispute has instituted the above dispute for recovery of money of Rs. 1,64,100/- and the same is posted for your appearance in the above said court on **24-09-2024 by 10.30 a.m.** If you failed to attend the said court on the said date, the matter will be heard and decided exparte.
Place: Chennur.
Date: 02-09-2024
// By Order of the Deputy Registrar of Chits, Adilabad//
Sd/-
M/s Mohana Chit Funds Pvt. Ltd., Chennur.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT ADILABAD
Dispute No. 243/2024
Between:
M/s Mayura Chit Funds Private Limited, Mancherial. ... DISPUTANT.
VERSUS
S.Krishna & Others ... OPPONENTS.
To,
2. Boddu Kumara Swamy, S/o Ramaiah, Occ: Gen Maz, kasipeta mine, E.C.No. 2388373, R/o H.No. 5-9, Somagudem, Bellampalli. 504 251.
3. Laxetti Mahesh, S/o Laxmaiah, Occ: Overman, R.K-5 incline, E.C.No. 123670, R/o Q.No. D-159, CCC Town ship, Dt. Mancherial. 504 302.
NOTICE
WHEREAS the Disputant M/s Mayura Chit Funds Private Limited, company, in the above Dispute has instituted the above dispute for recovery of money of Rs. 79,194/- and the same is posted for your appearance in the above said court on **24-09-2024 by 10.30 a.m.** If you failed to attend the said court on the said date, the matter will be heard and decided exparte.
// By Order of the Deputy Registrar of Chits, Adilabad//
Place:Mancherial.
Date: 03-09-2024.
Sd/-
M/s Mayura Cht Funds Private Limited Mancherial.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT ADILABAD
Dispute No. 227/2024
Between:
M/s Mohana Chit Funds Pvt. Ltd., Chennur. ... DISPUTANT.
VERSUS
K Rajamani & Others ... OPPONENTS.
To,
1. Kamtam Rajamani @ Koutam Rajamani, W/o Srinivas, Oce: Housewife, R/o H.No. 7-277, Reddy Colony, Bhupalpalli. Dt. Bhupalpalli. 506169.
2. Kamtam Srinivas, S/o Lingaiah, Age: 50 years, Occ: Trammer, KTK-8, E.c.No. 2894081, R/o H.No. 2-154, Laxmi Nagar, Bhupalpalli. 506169.
4. Ramchetti Anil, S/o Laxmi Narayana, Age: 36 years, Oce: Fireman, Emp.No. 1352901, R/o H.No. 23-1-135/2, 65 Dip Area, Bellampalli.
NOTICE
WHEREAS the Disputant M/s Mohana Chit Funds Pvt. Ltd., company, in the above Dispute has instituted the above dispute for recovery of money of Rs. 3,90,821/- and the same is posted for your appearance in the above said court on **24-09-2024 by 10.30 a.m.** If you failed to attend the said court on the said date, the matter will be heard and decided exparte.
// By Order of the Deputy Registrar of Chits, Adilabad//
Place: Chennur.
Date: 02-09-2024
Sd/-
M/s Mohana Chit Funds Pvt. Ltd., Chennur.

నిందితుడిని చట్టపరంగా శిక్షించాలి



ఆదిలాబాద్‌టౌన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జైనూర్‌లో అమాయక ఆదివాసీ మహిళలను మాయమాటలు చెప్పి ఆటోలో నిర్మానుష్య ప్రాంతంలో తీసుకొని వెళ్లి లైంగికదాడికి పాల్పడి, హత్య చేసి చనిపోయిందనుకొని అక్కడి నుంచి వెళ్లిపోయిన షేక్ మగ్దూం అనే మైనారిటీ వ్యక్తిని చట్టపరంగా శిక్షించాలని, ఆదిలాబాద్ రూరల్ మండల ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి మెస్రం కేశవ్, గేడం రాము డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జైనూర్‌లో ఇప్పటివరకు వందమంది ఆదివాసీ మహిళలను అత్యాచారాలు, మానభంగాలు బలవంతంగా పెండ్లిలు జరుగుతున్న ఇంతవరకు అధికారులు ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం చాలా దుర్మార్గమైన చర్య అని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. జైనూర్‌లో ఎవరైతే అక్రమాలకు, అత్యాచారాలకు, హత్యలకు, దాడులకు పాల్పడుతున్న మైనార్టీలను అక్కడ నుంచి పంపివేయాలన్నారు. పెసా 1/70, చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. జైనూర్‌లో గిరిజనేతరుల షాపులను, ముస్లిం మైనార్టీ యువకుల షాపులను పూర్తిగా దహనం చేసి ఆదివాసీలపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఆదివాసీ నాయకులు ఉన్నారు.

ఆదివాసీ సేన ఆధ్వర్యంలో...

జైనూర్‌లో ఆదివాసీ మహిళపై అత్యాచార ప్రయత్నం చేసి, హత్యచేసి దానిని రోడ్డు ప్రమాదంగా చిత్రికరించిన షేక్ ముగ్దుం అనే దుండగుడిని వెంటనే బహిరంగంగా ఉరి తీయాలని ఆదివాసీ సేన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు రాయిసిడం జంగు పటేల్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధిత మహిళకు ప్రభుత్వమే మెరుగైన వైద్యమందించి, తగు నష్టపరిహారాన్ని చెల్లించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించాలని పేర్కొన్నారు. బాధిత మహిళకు ప్రాణనష్టం జరిగినచో ఆదివాసీ సమాజం, అన్ని ఆదివాసీ సంఘాలతో కలిసి ఏజెన్సీ ప్రాంతంలో తీవ్ర ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరిస్తున్నట్టు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో...

జైనూర్‌లో జరిగిన ఘటనను బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నామని, బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు యూనిస్ అక్బాని, సాజిదోద్దీన్ పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో పాలనలో ఇలాంటి గొడవలు ఎన్నడూ ఎక్కడ జరగలేదన్నారు. కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పటికీ అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా విఫలమైందని పోలీసుల రక్షణ కరువైందని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా మత ఘర్షణలు మరింత పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. ఆదివాసీ గిరిజన గ్రామాలు వారి సంస్కృతి శాంతి స్థాపన కోరుకున్నదని, అలాంటిది ఆదివాసీ గ్రామాల్లో కొంత మంది మతోన్మాద దుష్టశక్తులు దూరి అల్లర్లు సృష్టిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఆరోపించారు. ఈ ఘటనపై పూర్తి వైఫల్యం కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునారావృతం కాకుండా చర్యలు చేపట్టి, జరిగిన ఘటనకు ముస్లిం సమాజాన్ని నిందించద్దని కోరారు. ఏదైనా ఉంటే మతసామరస్యంగా మాట్లాడుకోవాలన్నారు. తప్ప శాంతి భద్రతలను దెబ్బతీసేలా చర్యలు చేపట్టొద్దని కోరారు. ఇకనైనా ఇలాంటి మత ఘర్షణలు చోటివ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చాకచక్యంగా వ్యవహరించాలని హెచ్చరించారు. సమావేశంలో మైనార్టీ నాయకులు సలీం, మాజీ ఎంపీపీ గంగ్రత్ రమేష్, హేజాజ్, అశోక్, వాగ్మారె ప్రశాంత్ పాల్గొన్నారు.

మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో...

జైనూర్‌లో అమాయక గిరిజన ఆదివాసీ మహిళపై. లైంగికదాడి చేసిన నిందితుడిని, అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రిమాండ్‌కు పంపించడమే కాకుండా తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితుడికి ఉరి శిక్ష పడే విధంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు ప్రారంభించాలని పేర్కొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

జైనూర్‌లో ఆదివాసీ మహిళ మీద అత్యాచారం, హత్యాయత్నం చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని బీజేపీ నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుమురంభీం పోరాటాలకు స్ఫూర్తినిచ్చిన గడ్డ జైనూర్ ప్రాంతంలో ఈ విధంగా ఒక గిరిజన మహిళపై అత్యాచారం జరిపి హత్య చేయడానికి ప్రయత్నించిన నిందితుడిని కఠినంగా శిక్షించడంతో పాటు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు ఓవైసీ మహిళపై జరిగిన అత్యాచారాన్ని ఖండించకుండా మసీదులపై దాడులు జరుగుతున్నాయని ముసలి కన్నీరు కార్చడం సిగ్గుచేటని విమర్శించారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన మంత్రి సీతక్క సమస్యను పక్కదోవ పట్టించే విధంగా దొంగతనం చేసే సందర్భంలోనే ఇలా జరిగిందని పేర్కొనడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఆదివాసీ బిడ్డగా ఆదివాసులపై జరుగుతున్న అత్యాచారాలను తీవ్రంగా ఖండించాల్సిన సీతక్క ఈ విధంగా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. ఈ విషయంలో ఇప్పటికే పోలీస్ యంత్రాంగం ప్రాథమిక చర్యలు చేపట్టినప్పటికీ అవి బాధిత మహిళకు న్యాయం జరిగేలా లేవని, అత్యాచారం చేసిన మగ్దూంను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని, మహిళకు న్యాయం జరిగే వరకూ పార్టీ తరఫున కడవరకు పోరాడుతామని స్పష్టం చేశారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు, గందే విజయ్ కుమార్, జిల్లా సీనియర్ నాయకులు అల్లూరి నారాయణరెడ్డి, బీజేపీ అధికార ప్రతినిధి సలేంద్ర శివయ్య ముదిరాజ్, బీజేపీ కిషన్ మోర్చా కార్యవర్గ సభ్యులు చింతలపల్లి సతీష్‌రెడ్డి, మహిళా నాయకురాలు కాంతబాయి, భాగ్యలక్ష్మి ఉన్నారు.

ఇంద్రవెల్లి : జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళా పై అఘాయిత్యానికి పాల్పడిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఏజన్సీ లోని ఆదివాసులపై రోజు రోజుకు లైంగిక దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దుండగులు ఎంతటి వారైనా శిక్షించాలన్నారు. బాధితురాలికి ప్రభుత్వం తరపున రూ.పదిలక్షల పరిహారం చెల్లించడంతో పాటు నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లక్కు పటేల్,మెస్రం వసంత్ తదితరులు పాల్గొన్నారు.


ఇంద్రవెల్లి


నార్నూర్


నార్నూర్


ఆదిలాబాద్‌టౌన్

ఉట్నూర్ : ఉమ్మడి జిల్లాలోని ఆదివాసి గిరిజన మహిళలపై దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలని అదిమ గిరిజన కొలాం సేవా సంఘం మండల అధ్యక్షుడు సిడాం బాపురావు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసి మహిళలపై లైంగిక దాడులు, హత్యాయత్నాలు జరుగుతున్నందున దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జౌనూర్ సంఘటనకు బాధ్యుడైన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఫస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించి తక్షణమే శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో టేకం మాధవరావు, మడావి నాగోరావు, కొడప లక్ష్మణ్, టేకం జంగు, ఆత్రం కృష్ణ, టేకం మారుతి తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్ : జైనూర్‌కు వెళ్లేందుకు సిద్ధమైన మండలానికి చెందిన బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో బీజేపీ మండల నాయకులు తొడసం బండు, రాథోడ్ భిక్కు, బాబూలాల్, రాంనివాస్, ధర్మరక్షక్, దేవిదాస్, రవీందర్ ఉన్నారు. ఈ సందర్భంగా పోలీసులు మండలంలో 144 సెక్షన్ అమలు చేశారు.



ఆదిలాబాద్‌టౌన్



ఉట్నూర్